సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 20 । డిసెంబర్ । 2024



రప్పరప్పాలాడిస్తున్న పుష్ప

పలమనేరులోని పొలాల్లో నివాసం ఉంటున్న ఇళ్లనే టార్గెట్ చేసిన ఓ ఏనుగు (పుష్ప) వరుస దాడులు చేస్తోంది. - 8లో



పాలకుల పాపం.. టీచర్ దుర్మరణం

పోలీస్‌స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాలు తీసుకెళ్తూ తలపులపల్లె స్కూల్ ఉపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. - 8లో

పిచ్చికుక్క స్వైర విహారం



పుత్తూరు పట్టణ వీధుల్లో ఓ పిచ్చి కుక్క కరవడంతో పలువురు తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంధన పొదుపు పాటిద్దాం



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్, పక్కన ఈఈ మునిచంద్ర

చిత్తూరు కార్పొరేషన్: ఇంధన పొదుపును జీవితంలో భాగంగా పాటిద్దామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ తెలిపారు. గురువారం స్థానిక వివేకానంద విగ్రహం వద్ద ఇంధన పొదుపు వారోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అవసరం లేని సమయంలో విద్యుత్ వాడకం తగ్గించాలన్నారు. నేడు మనం పాటించే పొదుపు భవిష్యత్ తరాలకు వెలుగునిస్తుందన్నారు. విద్యుత్ పరికరాలను 5 స్టార్ ఉండేవి వాడాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంను అందరూ వినియోగించుకోవాలని, 3 కేవీ సామర్థ్యం వరకు కేంద్ర ప్రభుత్వం సబ్సీడీ ఇస్తుందన్నారు. ఆసక్తిదారులు ఇంటి పైకప్పు మీద సౌరఫలకాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కువగా నివాసాల్లో విద్యుత్ పరికరాలు వాడనప్పుడు స్విచ్‌లు ఆఫ్ చేయాలని, దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డివిజన్ పరిధిలో విద్యుత్ దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. వినియోగదారులకు సమస్యలు ఉంటే కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని వివరించారు. అనంతరం ఉద్యోగులు గాంధీవిగ్రహం వరకు నినాదాలు చేసుకుంటూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కాస్త పెరిగింది. క్యూ కాంప్లెక్స్‌లో 16 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 70,457 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,152 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.16 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం కల్పిస్తున్నారు. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

చలితో గజగజ..
జ్వరాలతో విలవిల



జిల్లా ప్రభుత్వాస్పత్రిలో రోగులు

జిల్లాను జ్వరాలు పట్టిపీడిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు శీతాకాలం ..చలిగాలులు తోడవడంతో చాలామంది చలిజ్వరం బారిన పడుతున్నారు. పారిశుద్ధ్యం కొరవడడంతో గ్రామాల్లో డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్‌లు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరచి, జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లాప్రజలు కోరుతున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న జ్వర పీడితులు
- దగ్గు, జ్వరం, జలుబు, కీళ్లనొప్పులు, తలభారంతో సతమతం
- అడ్మిట్ అవుతున్న వారే అధికం
- భయపెడుతున్న డెంగీ, టైఫాయిడ్ జ్వరాలు
- ప్రభుత్వాస్పత్రుల్లో అరకొర వైద్యసేవలు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో టెస్ట్‌ల పేరిట పేషెంట్ల రక్తం తాగేస్తున్న వైద్యులు
- అధికార యంత్రాంగం స్పందించాలంటున్న జ్వరపీడితులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాను విష జ్వరాలు కుదిపేస్తున్నాయి. వర్షాలు, వాతావరణంలో నెలకొన్న మార్పులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. తీవ్ర చలిగాలులకు పిల్లలు, వృద్ధులు, మహిళలు జ్వరాల బారిన పడుతున్నారు. డెంగీ, టైఫాయిడ్, తదితర విష జ్వరాలతో జనం సతమతమవుతున్నారు. వర్షాలు పడుతున్నాయన్న ఆనందం కంటే జ్వరాలు సోకుతున్నాయనే ఆందోళనే ఎక్కువైంది. జలుబు, దగ్గు, కీళ్ల నొప్పులు, తలభారం, తీవ్ర జ్వరాలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద జనం క్యూ కడుతున్నారు. మరికొందరు తీవ్ర జ్వరం, కఫంతో ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతూ ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్‌లుగా చేరి రోజుల తరబడి చికిత్సలు పొందుతున్నారు.

జ్వరపీడితుల్లో కనిపిస్తున్న లక్షణాలు



వందల సంఖ్యలో ఓపీలు

జిల్లాలో జ్వరాల తీవ్రత పెరిగింది. డెంగీ, టైఫాయిడ్‌తో ఎక్కువమంది ఆస్పత్రుల పాలవుతున్నారు. స్థానిక సంస్థల్లో దోమల నివారణ చేపట్టకపోవడంతో జ్వరాలు బాగా పెరిగాయి. జిల్లావ్యాప్తంగా ఒక జిల్లా ఆస్పత్రి ఉండగా.. 4 ఏరియా, 8 సీహెచ్‌సీలు, 50 పీహెచ్‌సీలు, అలాగే 2 వేలకు పైగా ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోజూ 350 నుంచి 500వరకు జ్వర లక్షణాలతో కనిపిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు సైతం జ్వరంతో వందల సంఖ్యలో క్యూకడుతున్నారు. ఓపీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యంగా జ్వర పీడితుల్లో ఎక్కువగా పిల్లలే ఉన్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. ఇందుకు ప్రధాన కారణం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, చలిగాలులు.

కొరవడిన పారిశుద్ధ్యం



నగరి మండలం ఓజీకుప్పం స్కూల్ వద్ద పగిలిన డ్రైనేజీ కాలువ



ఓజీకుప్పంలో డ్రైనేజీ పక్కనే తాగునీటి కొళాయి

వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. దోమల ఉధృతి పెరిగింది. దీంతో సీజనల్ వైరస్‌లు విజృంభిస్తున్నాయి. చాలామందిలో జ్వరం లక్షణాలు కనిపిస్తున్నాయి. పట్టణాల్లో మురుగు కాల్వలను సరిగా శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. గ్రామాల్లో మురుగు కాల్వల నిర్మాణాలు సరిగా లేవు. ఎక్కడ పడితే అక్కడ మురుగు నీరు నిలుస్తోంది. ప్రతీ శుక్రవారం డ్రైడే నిర్వహించాల్సి ఉండగా ఇది ఎక్కడా అమలు కావడం లేదు. ఈ కారణాలతో దోమలు విరుచుకుపడి ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్నాయి.

భయపెడుతున్న డెంగీ..



జిల్లాను డెంగీ జ్వరాలు భయపెడుతున్నాయి. ఒక్కసారిగా కేసులు పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లోనే ఈ కేసులు నమోదు ఎక్కువగా ఉన్నాయి. వందలాది డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా లెక్కలోకి రాని కేసుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. ఇలాంటి తరుణంలో ల్యాబ్‌లకు కాసుల వర్షం కురుస్తోంది. కొందరు ప్రైవేటు ఆస్పత్రుల్లో డాక్టర్లు ఇష్టానుసారం టెస్టులు రాసి ప్రజల రక్తాన్ని తాగేస్తున్నారు. ఇక అడ్మిట్ అయిన వారి దగ్గర వేల నుంచి లక్షల రూపాయల మేర గుంజేస్తున్నారు. రూ.200 వరకు ఫీజు ఉంటే మందులు, మాత్రలకు రూ.1000 ఖర్చవుతోంది. సెలైన్ బాటిళ్లు పెడితే రూ.500 నుంచి రూ.1000 వరకు చార్జ్ చేస్తున్నారు. బ్లడ్ టెస్ట్ రూ.800 వరకు వసూళ్లు చేసుకుంటున్నారు. దీంతో జ్వర పీడితుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.

నిర్లక్ష్యం చేయకండి..



కురిసిన వర్షాలకు దోమల ఉధృతి అధికంగా ఉంది. దోమల వ్యాప్తి, వాతావరణంలో మార్పుల కారణంగా విషజ్వరాలు వస్తున్నాయి. దీంతో పాటు టైఫాయిడ్, డెంగీ కేసులు చూస్తున్నాం. ఇలాంటప్పుడు నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే డాక్టర్లను సంప్రదించాలి. రక్తపరీక్షలు చేయించుకుని మందులు, మాత్రలు వాడాలి. సొంత వైద్యం వద్దు. ముఖ్యంగా దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

– ప్రభావతిదేవి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

క్షేత్రస్థాయిలో..

జిల్లావ్యాప్తంగా విష జ్వరాలు విలయతాండవం చేస్తున్న క్షేత్రస్థాయిలో పని చేసే ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. జ్వరాల కట్టడికి కనీస చర్యలు చేపట్టడం లేదు. జ్వరపీడితులను గుర్తించి వారికి మందులు, మాత్రలు ఇచ్చే కార్యక్రమాన్ని మర్చిపోయినట్లు కనిపిస్తోంది. క్షేత్రస్థాయిలో వైద్యసేవలు పూర్తిగా గాడితప్పింది. అలాగే పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు చుట్టపు చూపుగా కనిపిస్తున్నాయి. కొందరు అధికారులు కూడా ఇష్టారాజ్యంగా డ్యూటీలకు వస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం చుట్టూ రాజకీయం నడిపిస్తున్నారు. విధులను గాలికొదిలేశారు. ఇలాంటి తరుణంలో పల్లె వైద్యం పక్కదారి పడిందని పలువురు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి జ్వరం నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి



ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి విజయ కోరారు. ఈ మేరకు గురువారం ఆ సంఘ నాయకులు జిల్లా ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక సమస్యలు ఉన్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం పలు మార్లు కలెక్టరేట్ ఎదుట ధర్నాలు నిర్వహించామన్నారు. సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ సౌకర్యం కల్పించాలన్నారు. సర్వీసులో ఉండి మృతి చెందే ఉద్యోగుల దహన సంస్కారాలకు రూ.20 వేలు, కుటుంబీకులకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్పర్ల ఉద్యోగోన్నతులకు నిర్దిష్టమైన నిబంధనలను రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మమత, తదితరులు పాల్గొన్నారు.

అరగొండ అపోలోలో సర్జరీ విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న సర్జన్లు

తవణంపల్లి: మండలంలోని అరగొండ అపోలో హాస్పిటల్‌లో అత్యాధునిక విధానం ద్వారా షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీ విజయవంతంగా నిర్వహించినట్లు ఆర్థోపెడిక్ సర్జన్లు పమ్మి కార్తీక్‌రెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఈమేరకు గురువారం మండలంలోని అరగొండ అపోలో ఆస్పత్రిలో వారు విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే షోల్డర్ రీప్లేస్‌మెంట్ సర్జరీలో నేడు నూతన శకం ఆరంభమైందన్నారు. అరగొండ అపోలో ఆస్పత్రిలో కూడా అత్యాధునిక విధానం అందుబాటులో ఉందన్నారు. ఈ సర్జరీలో నొప్పి శాతం చాలా తక్కువగా ఉంటుందని, రోగులు త్వరగా కోలుకుంటారని తెలిపారు. మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఐ హనుమంతప్పకు అవార్డు

- డ్రమ్ములో శవం కేసు ఛేదనలో సీఐ హనుమంతప్ప బృందం ప్రత్యేక ప్రతిభ
- ఈ ఏడాది జులైలో కర్నూలు జిల్లాలో సంచలనం సృష్టించిన కేసు
- చిన్న ఆధారం లేకపోయినా వారంలోపే నిందితుల అరెస్టు
- ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డు రావడం ఆనందంగా ఉంది : సీఐ హనుమంతప్ప



డీజీపీ తిరుమలరావు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కార్వేటినగరం సీఐ హనుమంతప్ప

కార్వేటినగరం: రాష్ట్రంలోనే ఉత్కంఠను రేకెత్తించిన 'డ్రమ్ములో శవం కేసు' ఛేదనలో ఉత్తమ ప్రతిభ చూపిన డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, సీఐడీ మస్తాన్‌వలి, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీ ప్రసన్న, కానిస్టేబుళ్లు అగస్టిన్, మల్లికార్జున, హోంగార్డు గోవర్ధన్ సింగ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ అందించే ప్రతిష్టాత్మక ఏబీసీడీ అవార్డు అందుకున్నారు. విజయవాడలోని డీజీపీ కార్యాలయంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఈ ఏడాది జూలై 28వ తేదీన కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో డ్రమ్ములో గుర్తుతెలియని శవం బయటపడింది. డీజీపీ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సీఐ హనుమంతప్ప టీం ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ 48 గంటల్లోనే కేసు ఛేదించారు. ఆపై వారంలోపే నిందితుల ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. ఈ కేసు విచారణలో ఉత్తమ పనితీరు కనబరచిన సీఐ హనుమంతప్ప బృందానికి రాష్ట్ర డీజీపీ, కర్నూలు జిల్లా ఎస్పీ, డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు. అలాగే ఆస్పరి మండల ప్రజలు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అవార్డు రావడంపై సీఐ హనుమంతప్ప ఫోన్‌లో స్థానిక మీడియాతో మాట్లాడుతూ ఈరోజు తనకు ఎంతో ఆనందంగా ఉందని, ఈ కేసు విషయంలో నిద్రలేని రాత్రులు గడిపామని, పనితీరును ఉన్నతాధికారులు గుర్తిస్తారనడానికి ఈ కేసు ఒక నిదర్శనమన్నారు. ఏబీసీ డీ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ప్రజలకు సేవలు అందించడంలో విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటానని, అందరికీ కృతజ్ఞతలు అన్నారు.

పోలీసు కుటుంబానికి ఆర్థికసాయం



మృతుడి సతీమణికి చెక్కు అందజేస్తున్న ఏఎస్పీ

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు కుటుంబానికి రూ.75 వేల ఆర్థిక సాయాన్ని చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు అందజేశారు. నింద్ర పోలీస్ స్టేషన్‌లో పని చేస్తూ ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ వినోద్‌కుమార్ మృతి చెందాడు. గురువారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో వినోద్ భార్య కళావతికి ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందించారు. చనిపోయిన పోలీసు కుటుంబాలకు ఎలాంటి ఆపద వచ్చినా, ఆదుకునేందుకు జిల్లా పోలీసుశాఖ సిద్ధంగా ఉంటుందని ఏఎస్పీ భరోసా ఇచ్చారు. కార్యాలయ పర్యవేక్షకులు సుబ్రమణ్యం, సిబ్బంది పార్థసారథి నాయుడు పాల్గొన్నారు.

నూతన పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

- పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించండి
- సమావేశంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు భూకేటాయింపులు త్వరితగతిన చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రమోషన్ కమిటీ (డీఐఈపీసీ) సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. సంబంధిత శాఖలు సమన్వయంతో భూ కేటాయింపు ప్రక్రియలు పకడ్బందీగా చేపట్టాలని, పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు. జిల్లాలో 55 భారీ పరిశ్రమల ఏర్పాటుతో 18,219 మందికి ఉపాధి అవకాశాలు, 34,700 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా 1,38,800 మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. మరో మూడు భారీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 975 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. నిర్దేశిత గడువు లోపు 943 దరఖాస్తులను పరిష్కరించినట్లు వివరించారు. ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో జిల్లా పరిశ్రమల కేంద్రానికి 71 యూనిట్లు లక్ష్యంగా నిర్దేశించగా, లక్ష్యాన్ని అధిగమించి 114 యూనిట్లు గ్రౌండ్ చేసినట్లు తెలిపారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో అర్హులైన లబ్ధిదారులకు పకడ్బందీగా శిక్షణ ఇవ్వాలన్నారు. పారిశ్రామికవాడ గంగ్రాజుపల్లిలో మౌళిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ సర్వేలో ఇప్పటి వరకు 9459 యూనిట్లకు సర్వే పూర్తి చేశారన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఏడీ వెంకటరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్‌డీఎం హరీష్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాజ్యలక్ష్మి, ఫుడ్ ప్రాసెసింగ్ అసోషియేషన్ నాయకులు గోవర్ధన్ బాబీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన వ్యక్తి మృతి


భరత్ కుమార్ నాయుడు (ఫైల్)

పెద్దపంజాణి: ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో వెలుగు చూసింది. ఎస్ఐ సహదేవి కథనం మేరకు వివరాలు.. మండలంలోని చామనేరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ నాయుడు కుమారుడు భరత్ కుమార్ నాయుడు(40) బుధవారం పుంగనూరులో పని పూర్తి చేసుకుని స్వగ్రామానికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలోని పెద్దవెలగటూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా వచ్చిన ఆవును ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు భరత్‌ను హుటాహుటిన తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వేకువజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

తెగిపడిన విద్యుత్ తీగ


కొయ్యకూలడంతో నేలకొరిగిన విద్యుత్ వైరు

చౌడేపల్లె: చౌడేపల్లె–బోయకొండ ప్రధాన రహదారిలోని చిన్నకొండామర్రి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న కొయ్య కూలడంతో విద్యుత్ వైరు తెగిపడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఓ వ్యవసాయ బోరుకు కరెంటు సరఫరా కోసం రోడ్డుకు ఇటువైపు నుంచి అటువైపునకు కొయ్యను ఏర్పాటు చేసి వైరు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో కొయ్యకూలడంతో రోడ్డుపై విద్యుత్ సరఫరా అవుతున్న వైరు తెగి పడింది. గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చి వైరును తొలగించారు. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ మార్గంలో ఎలాంటి ప్రమాదం సంభవించకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చౌడేపల్లె: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఏఎస్ఐ వాసు గురువారం తెలిపారు. మండలంలోని పెద్దయల్లకుంట్ల గ్రామానికి చెందిన పూల రాజప్ప కర్ణాటక మద్యం తెచ్చి పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేపట్టామన్నారు. ఇంట్లో 30 ప్యాకెట్లు కర్ణాకట మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిందితున్ని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా రిమాండుకు ఆదేశించినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మా వాళ్లకే ఉద్యోగం ఇవ్వండి..!

- డీఎంహెచ్ఓ పరిధిలో పోస్టుల భర్తీకి చర్యలు
- ఉమ్మడి జిల్లా ప్రకారం భర్తీ ప్రక్రియ
- ఈ నెల 13న ముగిసిన దరఖాస్తుల గడువు
- 23 పోస్టులకు 1,452 దరఖాస్తులు
- ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలతో అధికారులకు గుబులు
- పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు



చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా వైద్యశాఖలోని డీఎంఅండ్‌హెచ్ఓ పరిధిలోని ఎన్‌హెచ్ఎంలో పదుల సంఖ్యలో విడుదలైన పోస్టులకు కూటమి నేతలు పంతం పట్టారు. నీకా–నాకా అంటూ పోటీ పడుతున్నారు. ఈనెల 13వ తేదీ దరఖాస్తు ముగియగా.. 24 పోస్టులకు 1,452 దరఖాస్తులు వచ్చాయి. ఈ పోస్టులకు సిఫార్సు లేఖలు పోటెత్తుతున్నాయి. ఈ లెటర్లతో జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎవరికి చేయాలో తెలియక తికమక పడిపోతున్నారు. ఈ విషయం కలెక్టర్ చెవిలో పడడంతో పారదర్శకంగా పోస్టుల భర్తీ చేపట్టాలని హుకుం జారీ చేశారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌హెచ్ఎంలో పలు పోస్టులకు భర్తీ చేసేందుకు ప్రభుత్వం గత నెల 27వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 23 పోస్టులకు భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఈనెల 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించారు. దీంతో 1,452 దరఖాస్తులు వచ్చాయి. పోస్టుల వారీగా చూస్తే ఫిజీషియన్–1 పోస్టుకు 02 దరఖాస్తులు, అలాగే మెడికల్ ఆఫీసర్ 2 పోస్టులకు 26, డెంటిస్ట్ ఒక పోస్టుకు 121, ఆడియోలజిస్ట్ ఒక పోస్టుకు 10 దరఖాస్తులు, స్పెషల్ ఎడ్యుకేటర్ ఒక పోస్టుకు 25 దరఖాస్తులు, అప్తోమెట్రిస్ట్ ఒక పోస్టుకు 03 దరఖాస్తులు, స్టాఫ్ నర్సు 5 పోస్టులకు 780 దరఖాస్తులు, ల్యాబ్ టెక్నీషియన్ 2 పోస్టులకు 100 దరఖాస్తులు, ఫార్మసిస్ట్ 2 పోస్టులకు 153 దరఖాస్తులు, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ 7 పోస్టులకు గాను 232 దరఖాస్తులు అందాయి.

ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ..

పోస్టుల దరఖాస్తుల ప్రక్రియ పూర్తవగానే అభ్యర్థులు ఎలాగైనా ఉద్యోగంలో చేరిపోవాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఖర్చుకు వెనకడుగు వేయకుండా ప్రయత్నం చేస్తున్నారు. ముందుగా ప్రజాప్రతినిధులు, కూటమి నేతల సిఫార్సులను వెతుక్కుంటున్నారు. తెలిసిన వాళ్ల ద్వారా ప్రయత్నాలను ముమ్మరం చేసుకుంటున్నారు. ఈక్రమంలో ప్రజాప్రతినిధులు లెటర్లకు డిమాండ్ వచ్చి పడింది.

తలలు పట్టుకుంటున్న అధికారులు


చిత్తూరు డీఎంహెచ్ఓ కార్యాలయం

మా వాళ్లకే ఉద్యోగం ఇవ్వండని డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయానికి ప్రజాప్రతినిధులు, కూటమి నేతల నుంచి సిఫార్సు లేఖలు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతున్నాయి. దీనికి తోడు ఫోన్ కాల్స్ కూడా అధికం కావడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మెరిట్ జాబితాను తయారు చేయలేమని చేతులెత్తేసున్నారు. దీంతో మెరిట్ లిస్ట్ తయారీ కూడా ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయం కలెక్టర్ వరకు చేరడంతో పారదర్శకంగా చేపట్టాలని హుకుం జారీ చేశారు. ఈ కబురుతో అధికారులు కాస్త కుదురుగా సీట్లలో కూర్చుకుంటున్నారు. దీని తర్వాత అధికారుల జాబితా తయారీలో ఏవిధమైనా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తాయో వేచి చూడాల్సి ఉంది.

పిచ్చికుక్క స్వైర విహారం

- పుత్తూరులో 27 మందిని కరచిన వైనం

పుత్తూరు: పట్టణంలో ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేస్తూ 27 మందిని కరచింది. ఇందులో ముగ్గురు పిల్లలతో పాటు 15 మంది వృద్ధులు ఉన్నారు. వీరందరికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. పుత్తూరులోని ఆర్డీఎం గేట్ నుంచి ఎన్టీఆర్ కాలనీ, ఎన్జీఓ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్, తిరుపతి రోడ్డు, నగరం రోడ్డు, కాపువీధిలో కనబడిన ప్రతి ఒక్కరినీ పిచ్చికుక్క కరవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు దానిని కొట్టి చంపేశారు. కుక్క కాటుకు గురైన వారిలో గొల్లపల్లికి చెందిన తన్మయి(3), కృష్ణ సముద్రం గ్రామానికి చెందిన రియన్(4), ప్రతిభ(9), ఆరేటమ్మ కాలనీకి చెందిన రోజా(17), నెత్తంకు చెందిన సంతోష్(17), లక్ష్మీనగర్‌కు చెందిన రవికుమార్(31), కావరాజేనగర్‌కు చెందిన ధనరాజ్(21), ఎన్జీఓ కాలనీకి చెందిన బాలసుబ్రమణ్యం (42), కేశవ(19), రామచంద్రయ్య(53), ఆర్డీఎం గేట్‌కు చెందిన రామచంద్రరాజు (62), ఎన్టీఆర్ కాలనీకి చెందిన మధు(60), చాందిని(52), లక్ష్మీనగర్‌కు చెందిన సురేష్‌కుమార్(50), వెంకటనేష్(18), భారతయ్య(49), ముని(51) వెంకటేష్ (18), కృష్ణ(49) తదితరులు ఉన్నారు. వీరు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

లక్ష్య సాధనలో అలసత్వం వద్దు


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

చిత్తూరు కలెక్టరేట్ : క్షేత్రస్థాయిలో పథకాల లక్ష్యసాధనలో అలసత్వం వహించకూడదని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశమందిరంలో డీఆర్‌డీఏ, వెలుగు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్దేశించిన పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించాలన్న సంకల్పంతో డీఆర్‌డీఏ అనేక పథకాలను చేపడుతోందన్నారు. ఈ పథకాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లి గ్రామీణ పేదలకు చేరువచేయాలన్నారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటుతో ఇప్పటికే గ్రామాల్లో పేద మహిళల్లో ఆర్థిక స్వావలంబన చేకూరిందన్నారు. స్వయం సహాయ సంఘాల్లో సంఘానికి ఒకరినైనా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే డీఆర్‌డీఏ ముఖ్య ఆశయమన్నారు. సంఘాల్లో అర్హత కలిగిన మహిళలను చైతన్యవంతులు చేయాలని, తద్వారా సమాజం ఆర్థికంగా పురోగతి సాధిస్తుందని చెప్పారు. స్వయం సహాయక సంఘాలు సాంకేతికను అందిపుచ్చుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆన్‌లైన్ డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపిడి రవికుమార్, డీపీఎంలు వెంకటేష్, రవి, ఏపీఎం సుబ్బారెడ్డి, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

'నారాయణ' విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని గిరింపేటలో ఉన్న నారాయణ పాఠశాలలో విరామంలో తోటి విద్యార్థులెవరూ లేని సమయంలో ఓ విద్యార్థిని పాఠశాల భవనంపై నుంచి దూకేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. చదువుల విషయంలో అధిక ఒత్తిడి పెట్టడం వల్లే విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిసింది. ఆ సమయంలో అక్కడే పనిచేస్తున్న ఓ టీచర్ గమనించడంతో కాపాడగలిగారని సమాచారం. కాగా ఆ విద్యార్థినే రెండవసారి ఇలా పాఠశాలలో ఆత్మహత్యకు ప్రయత్నించిందని అక్కడి టీచర్లు చెబుతున్నారు. ఈ ఘటనపై పాఠశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించగా అలాంటి ఘటన జరగలేదని చెప్పారు.

వచ్చే ఏడాది నుంచి డీడీఈ అడ్మిషన్లు షురూ!

తిరుపతి సిటీ: ఎస్వీయూలోని డైరెక్టర్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా వచ్చే ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించేందుకు వర్సిటీ అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వర్సిటీ అధికారుల బృందం న్యూఢిల్లీ వెళ్లి డీడీఈలో నిలిచిపోయిన అడ్మిషన్లను పునరుద్ధరించాలని యూజీసీకి విన్నవించారు. ఈ నేపథ్యంలో జనవరి మొదట వారంలో యూజీసీ కమిటీ వర్సిటీలో పర్యటించి, డీడీఈ అడ్మిషన్ల ప్రకియను కొనసాగించేందుకు ఉన్న అర్హతలు, సదుపాయాలను పరిశీలించి అనుమతులు ఇవ్వనుంది. దీంతో వచ్చే ఏడాది నుంచి యూజీ, పీజీ, డిప్లొమో కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. దీంతో కొంత కాలంగా దూరవిద్య ద్వారా డిగ్రీ, పీజీ చేసేందుకు ఎదురు చూస్తున్న విద్యార్థులకు కాస్త ఊరట కలిగించనుంది.

వచ్చే నెల 18 నుంచి దూరవిద్య పరీక్షలు

ఎస్వీయూ డీడీఈ పరిధిలో 2021–22లో అడ్మిషన్లు పొందిన యూజీ, పీజీ, డిప్లొమో కోర్సుల విద్యార్థులకు వచ్చే నెల 18వ తేదీ నుంచి పరీక్షలను నిర్వహించనున్నారు. దీంతో పాటు పెండింగ్‌లో ఉన్న అన్ని కోర్సుల పరీక్షలను నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. జనవరి 2వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన ఈ పరీక్షలు, యూజీసీ కమిటీ పర్యటన నేపథ్యంలో వర్సిటీ అధికారులు వాయిదా వేశారు.

దివ్యాంగ క్రికెట్ పోటీల రిజిస్ట్రేషన్‌కు నేడు తుది గడువు

తిరుపతి సిటీ: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి దివ్యాంగ క్రికెట్ పోటీలకు ఆసక్తిగల అభ్యర్థులు శుక్రవారంలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆ కమిటీ చైర్మన్ సూర్యనారాయణ తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, దివ్యాంగ క్రికెట్ కమిటీ, ఏపీ దివ్యాంగ క్రికెట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ తేదీని ఈనెల 21న ప్రకటించనున్నట్లు తెలిపారు. వివరాలకు చిత్తూరు జిల్లా కన్వీనర్ నాగరాజును 9985882559, 7780167625 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పాలకుల పాపం..

టీచర్ దుర్మరణం

పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రభుత్వ టీచర్ ప్రాణాలు కోల్పోయాడు. నిరుపేద కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకుని టీచర్ పోస్టు సాధించిన అతను ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాడు. పూతలపట్టు మండలం తలపులపల్లి జెడ్పీ హైస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా సిద్ధయ్యశెట్టి విధులు నిర్వహిస్తున్నాడు. ఈయన గురువారం పోలీస్‌స్టేషన్ నుంచి సమ్మేటివ్–1 ప్రశ్నపత్రాలను స్కూల్‌కు తీసుకెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. 2025 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చెందాల్సి ఉన్న సిద్ధయ్యశెట్టి.. కూటమి ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్లే మృతి చెందాడని పలువురు టీచర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- సమ్మేటివ్ పరీక్షలను నిర్వహించడంలో ప్రభుత్వం విఫలం
- సామాజిక మాధ్యమాల్లో లీకైన ప్రశ్నపత్రాలు
- ఆపై పోలీస్‌స్టేషన్లలో భద్రపరచాలని ఆదేశాలు
- ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లాలని సూచన
- ప్రశ్నపత్రాలు తీసుకెళ్తూ తలపులపల్లి హైస్కూల్ టీచర్ సిద్ధయ్యశెట్టి మృతి
- కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై టీచర్ల ఆగ్రహం


ప్రమాదంలో గాయపడిన బయాలజీ టీచర్ సిద్ధయ్యశెట్టి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లలో సమ్మేటివ్ 1 పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 23వ తేదీతో ఈ పరీక్షలు ముగియనున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఈ పరీక్షలను నిర్వహించడంలో విఫలమైంది. సమ్మేటివ్–1 ప్రశ్నపత్రాలు సామాజిక మాధ్యమాల్లో లీక్ కావడంతో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపించింది. దీంతో అధికారులు ఈ నెల 16వ తేదీ నుంచి పరీక్షల మధ్యలో ఆగమేఘాలపై ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్‌లో భద్రపరచాలని క్షేత్రస్థాయిలో హెచ్ఎంలకు ఆదేశాలిచ్చారు. దీంతో జిల్లాలోని 32 మండలాల్లోని ఎంఈఓలు వారి పరిధిలోని స్కూళ్ల నుంచి ప్రశ్నపత్రాలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు.


ఈ ఘటనకు బాధ్యులెవరు ?

పూతలపట్టు పోలీస్‌స్టేషన్ నుంచి తలపులపల్లె జెడ్పీ హైస్కూల్ టీచర్ సిద్ధయ్యశెట్టి గురువారం మధ్యాహ్నం సోషల్ సబ్జెక్టు ప్రశ్నపత్రాలను బైక్‌లో తీసుకెళ్తుండగా రంగంపేట క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను తమిళనాడు రాష్ట్రం వేలూరులోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వాస్తవంగా ప్రశ్నపత్రాలు తీసుకెళ్లాల్సిన బాధ్యత సంబంధిత స్కూల్ హెడ్‌మాస్టర్లదే. అయితే తలపులపల్లె జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పట్టాభినాయుడు బయాలజీ టీచర్ సిద్ధయ్యశెట్టికి ప్రశ్నపత్రాలు తీసుకొచ్చే పని అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. దాదాపు జిల్లాలోని అన్ని స్కూళ్లలో ఇదే పరిస్థితి. అయితే ఈ ఘటనకు కూటమి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా ? అని టీచర్లు ప్రశ్నిస్తున్నారు.

ప్రతిరోజూ తీసుకెళ్లాలంటే కష్టమే !

ప్రతి రోజు సమ్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తీసుకెళ్లాలంటే చాలా కష్టమని టీచర్లు చెబుతున్నారు. జిల్లాలోని గంగాధరనెల్లూరు నియోజకవర్గం పాలసముద్రం మండలంలో 33 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. మండల కేంద్రం నుంచి తిరుమలరాజపురం జెడ్పీ హైస్కూల్‌కు 14 కి.మీ వరకు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కుప్పం నియోజకవర్గంలోని గుడుపల్లె మండలం పరిధిలో 67 స్కూళ్లు ఉన్నాయి. మండల కేంద్రం నుంచి మారుమూల ఉన్న ఓఎన్ కొత్తూరు హైస్కూల్‌కు 25 కి.మీ దూరం ఉంటుంది. అదే విధంగా నగరి నియోజకవర్గంలోని నిండ్ర మండలంలో 42 స్కూళ్లు ఉండగా, మండల కేంద్రం నుంచి అత్తూరు హైస్కూల్‌కు వెళ్లాలంటే 15 కి.మీ. ప్రయాణం చేయాలి. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది. ప్రతి రోజు ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లకు వచ్చి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లాలి. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన టీచర్ల చేత టీడీపీ కూటమి ప్రశ్నపత్రాలను మోపిస్తోంది.

అనాలోచిత నిర్ణయం వల్లే..



చదువు చెప్పాల్సిన గురువు..ప్రస్తుతం చదువుకు బరువయ్యారు. తలపులపల్లి జెడ్పీ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయుడు సమ్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాలు తీసుకెళ్తూ మృతి చెందడం చాలా బాధాకరం. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి రోజు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ప్రశ్నపత్రాలు తీసుకెళ్లే విధానం అమలు చేయడం అన్యాయం. ఈ అనాలోచిత విధానం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం అసంబద్ధం అని వినతులు ఇచ్చినా ఎలాంటి మార్పు లేదు.

– జీవీరమణ, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



ప్రమాదంలో మృతి చెందిన సిద్ధయ్య శెట్టి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి. టీచర్లు ప్రశ్నపత్రాలు మోసుకెళ్లే బాధ్యతలను వెంటనే తొలగించాలి. సిద్ధయ్యశెట్టి మృతికి బాధ్యత ఎవరు వహిస్తారో తెలిపాలి. బడిలో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు ప్రశ్నపత్రాలు మోసుకెళ్లడం బాధాకరం.

– రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్ఆర్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర ట్రెజరర్

ప్రభుత్వం కళ్లు తెరవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ప్రశ్నపత్రాలు తెస్తూ ప్రమాదంలో ఉపాధ్యాయుడు సిద్ధయ్యశెట్టి మృతి చెందడం చాలా బాధాకరం. ఆయన మృతి చిత్తూరు జిల్లాలోని టీచర్లందరికీ తీరని లోటు. ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అసంబద్ధ నిర్ణయాల వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

– బాలాజీ, ఏపీ టీచర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రప్పరప్పాలాడిస్తున్న పుష్ప

- ఆ ఏనుగుకు మనుషులంటే పగ..కసి
- నెలరోజులుగా పలమనేరు సమీపంలో బీభత్సం
- తాజాగా గంటావూరులోకి వచ్చిన ఒంటరి ఏనుగు
- పొలాల వద్ద నివాసం ఉండే ఇళ్లు, పశువులే దీని టార్గెట్
- హడలిపోతున్న జనం
- ఎలిఫెంట్ ట్రాకర్స్‌కు లొంగని మదపుటేనుగు


బుధవారం రాత్రి గంటావూరులోకి వచ్చిన మదపుటేనుగు

పలమనేరు: పుష్ప.. నీయవ్వ తగ్గేదేలే అన్నట్లు.. పలమనేరు పరిసర ప్రాంతాల్లో ఓ ఒంటరి ఏనుగు కూడా తగ్గేదేలే అనేలా ఇళ్లు, పశువులపై దండయాత్ర చేస్తోంది. గత నెల రోజులుగా పలమనేరు ఫారెస్ట్ రేంజి పరిధిలో పుష్ప అని పిలవబడే ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టిస్తోంది. అటవీ సమీప గ్రామాలవారు, పొలాల వద్ద నివాసం ఉంటున్న రైతులు ఈ మదపుటేనుగు దెబ్బకు హడలిపోతున్నారు. ఎప్పుడు ఎవరి ఇంటిపై దాడి చేస్తుందో అనే భయం వెంటాడుతోంది. తాజాగా పలమనేరు మున్సిపాలిటీ సమీపంలోని గంటావూరులోకి బుధవారం రాత్రి ఈ ఏనుగు వచ్చి కొందరి రైతుల ఇళ్లను ధ్వంసం చేసేందుకు యత్నించింది. ఇంతలో అక్కడికి చేరుకున్న ఎలిఫెంట్ ట్రాకర్స్ అతికష్టం మీద బాణసంచా పేల్చి అడవిలోకి మళ్లించారు. ఇదే ఒంటరి ఏనుగు మూడు రోజుల కిందట బండమీడజరావారిపల్లి వద్ద రైతు కొట్టంలో కట్టిన దూడను తొక్కి చంపిన విషయం తెలిసిందే.

పొలాల వద్ద ఉన్న ఇళ్లే టార్గెట్ ..

కౌండిన్య అడవికి ఆనుకుని ఉన్న మండిపేటకోటూరు, చెత్తపెంట, ముసలిమొడుగు, కాలువపల్లి, బేరుపల్లి, టీఎస్ అగ్రహారం, డంపింగ్‌యార్డు, గంటావూరు, జి.కోటూరు, గాంధీనగర్, బండమీద జరావారిపల్లి, జగమర్ల గ్రామాల సమీపాల్లో పొలాల వద్ద ఇళ్లపై పడుతోంది. ఏనుగును చూసి కుక్కలు మొరగడంతో వాటిని అనుసరిస్తూ ఆ ఇళ్ల వద్దకు వెళ్లి ధ్వంసం చేసి ధాన్యం, రాగులు తదితరాలను ఆరగిస్తోంది. ఆపై పశువులను వెంటాడి చంపేస్తోంది.

ట్రాకర్లకు తప్పని తిప్పలు..

పుష్పా ఏనుగును ఎలా కట్టడి చేయాలో అటవీశాఖ ఎలిఫెంట్ ట్రాకర్లకు సైతం దిక్కుతోచడం లేదు. ఏనుగుల గుంపులను మళ్లించడంలో నిష్ణాతులైన వీరికి సైతం మదపుటేనుగు ఏమాత్రం భయపడడం లేదు. దీంతో చేసేది లేక స్థానిక ఎఫ్ఆర్వో నారాయణ సైతం రైతుల పొలాల వద్ద రాత్రుల్లో ఉండరాదని సూచనలు చేస్తున్నారు.

మనుషులంటే కసి..

పలమనేరు కౌండిన్య అభయారణ్యంలో వందకు పైగా ఏనుగులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటిల్లో ఆరు వరకు మదపుటేనుగులు అడవిలోని ఆయా ఏరియాల్లో డాన్లుగా మారాయి. వీటిలో పుష్ప అని పేరు పెట్టిన ఈ మదపుటేనుగు గత నెల రోజులుగా జనాన్ని హడలెత్తిస్తోంది. తీవ్రమైన కోపంతో వేగంగా సంచరించే ఈ ఒంటరేనుగు జనంపై కసి పెంచుకుంది. పలమనేరు సమీపంలోని బండమీద జరావారిపల్లిలో పొలాల వద్ద నివాసం ఉంటున్న ఓ ఇంటిపై వారం కిందట దాడి చేసింది. అదే ఇంటికి మళ్లీ వెళ్లి అక్కడ పశువులపాకలో ఉన్న ఆవులపై పడింది. ఈ ఏనుగు ఘీంకారానికి పశువులు తాళ్లు తెంపుకుని పరుగులు తీయగా కట్టేసిన ఓ దూడ వెళ్లలేక దీనికి చిక్కింది. దీంతో ఆ ఏనుగు ఆవుదూడను కసిగా తొక్కి చంపేసింది.ఈ మదపుటేనుగు దెబ్బకు పొలాల వద్ద నివాసం ఉండే రైతులు గ్రామాలకు వచ్చేస్తున్నారు. అయితే పొలాల వద్ద కట్టేసిన పశువులను ఏమి చేస్తుందోననే భయం వారిని వీడట్లేదు.

పాలవ్యాన్ ఢీకొని చిన్నారి మృతి


మృతి చెందిన చిన్నారి నేత్ర(ఫైల్)

బంగారుపాళెం: పాలవ్యాన్ ఢీకొని గురువారం ఓ చిన్నారి మృతి చెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని చిల్లగుండ్లపల్లెకు చెందిన ధరణి కుమార్తె నేత్ర(3) ఇంటి ముందు ఆడుకుంటుండగా పాలవ్యాన్ ఢీకొనడంతో తలకు బలమైన గాయం తగిలింది. కుటుంబ సభ్యులు గాయపడిన చిన్నారిని చికిత్స నిమిత్తం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.